




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గుంటూరు పల్నాడు

సోమవారం 30 జూన్ 2025 - పేజీలు 8


ఉమ్మడి గుంటూరు జిల్లాలో. నకిలీ పత్తి విత్తనాలు రాజ్యమేలుతున్నాయి. నకిలీలను అదుపు చేయాల్సింది వ్యవసాయ శాఖ అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారనే విమర్శ వస్తోంది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి చెక్ పోస్టుల కళ్ళుగప్పి నకిలీ విత్తనాలు గుంటూరు. పల్నాడు జిల్లాలకు చేరి ఉమ్మడి జిల్లాలోని రైతులను నట్టేట ముంచుతున్నాయి. కొంతమంది వ్యాపారులు స్వలాభం కోసం రైతులను నిండా ముంచేస్తున్నారు. దిగుబడి బాగా వస్తుందని రైతులను నమ్మించి నిషేధిత బిజీ..3 పత్తి విత్తనాలను రైతులకు అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఒరిజినల్ విత్తన కంపెనీల లేబుల్స్ వాడుతూ రైతులను బురిడీ కొట్టిస్తున్నారు. బిజీ..3 రకం విత్తనాలను కేంద్ర ప్రభుత్వం నిషేధించినా. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం రైతుల్లో అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. తిరస్కరించిన విత్తనాలను కూడా రైతులకు కొంతమంది వ్యాపారులు విక్రయిస్తున్నారు.పల్నాడు జిల్లాలో కొంతమంది దళారులు రంగ ప్రవేశం చేసి గ్రామాల్లో తిరిగి రైతులకు ఈ విత్తనాలను అధిక ధరకు అంత కడుతున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అటు వ్యవసాయ శాఖ అధికారులు, ఇటు విజిలెన్స్, ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి విత్తనాలు కుప్పలు తెప్పలుగా రంగ ప్రవేశం చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలను విక్రయించుకుంటున్న వ్యాపారులు రైతులకు బిల్లులు మాత్రం ఇవ్వటం లేదు. తీరా దిగుబడి తగ్గిపోయి నష్టాలు నషాలానికి అంటినప్పుడు మాత్రమే. రైతులు లబోదిబోమంటున్నారు. కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కూడా ఈ నకిలీ విత్తనాలు గుంటూరుకు చేరి. ఇక్కడి నుంచి తెలంగాణ జిల్లాలకు కూడా తరలి వెళుతున్నట్లు సమాచారం. ఒక పత్తి విత్తనాలే కాదు మిర్చి, కల్తీ వరి విత్తనాలు కూడా మార్కెట్లను ముంచేత్తుతున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో రైతులను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. అంతేకాదు నకిలీ, కల్తీ విత్తనాల విక్రయదారులపై ఉక్కు పాదం మోపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది..

- గుంటూరు/పల్నాడు జిల్లా
నేటి దినపత్రిక సూర్య బ్యూరో

# నకిలీ సీడ్..
# అమ్మకాలు స్పీడ్

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్నాడు, గుంటూరులో నకిలీ పత్తి విత్తనాల దందా యథేచ్ఛగా సాగిపోతోంది.. మాయమాటలతో రైతులను కొందరు వ్యాపారులు నిండా ముంచుతున్నారు. నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు,ప్రభుత్వ పెద్దలు నిద్రావస్థలో నకిలీ విత్తనాల ఉనికి ఎక్కడైనా బయటపడితే అక్కడక్కడ తూతూ మంత్రంగా అరెస్టు చేసి వ్యవసాయ శాఖ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. నకిలీ విత్తనాలు అమ్మకాల్లో రాటుదేలిన వ్యాపారుల మోసాలు మాత్రం ఆగడం లేదు. ఓ వైపు నిషేధిత బీజీ–3 (బోల్‌గార్డ్–3) విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తూ.. దిగుబడి ఇవ్వటంలేదని తిరస్కరించిన

- రైతులకు నిషేధిత బీజీ- 3
- విత్తనాలు అంటగడుతున్న కేటుగాళ్లు
- నిద్రపోతున్న వ్యవసాయ శాఖ
- గ్రామాల్లో దళారులతో నకిలీ, కల్తీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారులు

విత్తనాలను లూజ్‌గా కొంతమంది వ్యాపారులు రైతులకు అంటగడుతున్నారనే విమర్శ వస్తున్నాయి. నిషేధిత బీజీ–3 విత్తన కంపెనీలతోపాటు కొందరు దళారులు జిల్లాల్లో ఏజెంట్లను నియమించుకొని నకిలీ విత్తనాల దందా సాగిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు మిగతా 3వ పేజీలో






# తుమ్మలచెరువు వద్ద
# విశాఖ ఎక్స్‌ప్రెస్ దోపిడీకి విఫలయత్నం

- వారంలో రెండుసార్లు దోపిడీ
- ఆదివారం తెల్లవారుజామున దోపిడీకి విఫలయత్నం
- గాలిలోకి కాల్పులు జరిగిన రైల్వే పోలీసులు
- పారిపోయిన దొంగల ముఠా
- బీహార్, మహారాష్ట్ర దొంగల గ్యాంగ్‌గా అనుమానం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

పల్నాడు జిల్లా తుమ్మల చెరువు వద్ద విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం తెల్లవారుజామున బీహార్, మహారాష్ట్రకు చెందిన దొంగల ముఠా.చోరీకీ యత్నం చేసింది. దీంతో రైలులో కొద్దిసేపు గందరగోళ వాతావరణం ఏర్పడింది. ప్రయాణికులు కూడా చాకచక్యంగా వ్యవహరించడంతో దొంగల ముఠా ఆటలు సాగలేదు. రైల్వే పోలీసులకు కూడా సకాలంలో స్పందించడం, గాలిలో కాల్పులు జరగడంతో దొంగల ముఠాలోని సభ్యులు పలాయనం చిత్తగించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన ఆసక్తికరమైన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో కొందరు దుండగులు ఆదివారం తెల్లవారుజామున.భారీ దొంగతనానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ప్రయాణికులు జాగూరూ కతో అప్రమత్తమయ్యారు. వెంటనే అక్కడ భోగిల్లో ఉన్న రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు కూడా వెంటనే అప్రమత్తమై గాల్లోకి కాల్పులు జరిపారు. దొంగతనాలకు పాల్పడిన వారు బీహార్, మహారాష్ట్రకు చెందిన దొంగల ముఠా గ్యాంగ్ గా గుర్తించారు. గతంలో ఈ ముఠా సభ్యులు పలుచోట్ల పెద్ద ఎత్తున దొంగతనాలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు వద్ద విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం తెల్లవారుజామున చోరీ యత్నం జరిగింది. ఈ క్రమంలో రైల్వే పోలీసులు.. గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో, దొంగల ముఠా పారిపోయింది. అయితే, పిడుగురాళ్ల సమీపంలో వరుసగా రైళ్లలో బీహార్, మహారాష్ట్ర మిగతా 3వ పేజీలో

### మానవత్వానికి ప్రతీకగా నిలిచిన

# మానవత స్వచ్ఛంద సంస్థ


### నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్**



మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గత మూడు సంవత్సరాలుగా గుంటూరులో బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలిచిందని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం గుంటూరులోని బాలాజీ కళ్యాణ మండపంలో జరిగిన మానవత 3వ వార్షికోత్సవ కార్యక్రమానికి పులి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గుంటూరు నగరంలో 5 లక్షల మొక్కలను నాటి హరిత గుంటూరుగా మార్చాలనే సంకల్పంలో మానవత భాగస్వామ్యం కావాలని కోరారు. మానవత లాంటి స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని గుంటూరు నగరాన్ని పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మానవ సంబంధాల విశిష్టతను తెలిపే రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన కవితను చదివి వినిపించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు ప్రసంగిస్తూ 2004లో 108 మంది సభ్యులతో ప్రారంభమైన మానవత నేడు 132 శాఖలకు విస్తరించి, 80 వేల సభ్యులతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం గొప్ప పరిణామమన్నారు. వార్షిక సభ్యత్వం 600 రూపాయలు చెల్లించి మానవతలో సభ్యులుగా చేరి సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటును అందించాలని కోరారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 1990వ దశాబ్దంలో అక్షరాస్యత ఉద్యమంలో ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు సమిష్టిగా కృషి చేయడం వలన ఆ దశాబ్దంలో 17 శాతం అక్షరాస్యత పెరిగిందని, నేడు ఈ ప్రయోగాన్ని పునరావృతం చేసి అక్షరాస్యతలో 32వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను అక్షరాంధ్రప్రదేశ్ గా మార్చాలన్నారు. మానవత లాంటి పలు సంస్థలు గుంటూరు నగరంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని, వీటన్నింటిని కలుపుకుని గుంటూరులోని పేద ప్రజల అభివృద్ధికి కృషి చేయా లన్నారు. గుంటూరు నగర కమిషనర్ నగరంలోని సమస్యలను ఎత్తి చూపడానికి, పరిష్కరించడానికి తోడ్పడే వాట్సాప్ గ్రూప్ ను రూపొందించి , సక్రమంగా నిర్వహించడం అభినందనీయ మన్నారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, తెనాలి, పొన్నూరు, బాపట్ల లో మానవత శాఖలు ఏర్పడి పనిచేస్తున్నాయని, త్వరలో మరో 5 పట్టణాలలో మానవత శాఖలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సర్వసభ్య సమావేశం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షునిగా డా౹౹ కోట శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా డా౹౹ పి. కల్పన, కార్యదర్శిగా కె. సతీష్ బాబు, కోశాధికారిగా టీ. వి. సాయిరాం, సంయుక్త కార్యదర్శిగా కర్నాటి ఆనంద్ లను ఎన్నుకొని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మానవత పూర్వ అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీనివాసరావు, మెడికల్ విభాగ చైర్మన్ టి. ధనుంజయ రెడ్డి, విద్యా విభాగ చైర్మన్ డా౹౹ ఎన్. అరవింద్, అవయవ దాన చైర్మన్ టి. సుందర రామయ్య, డైరెక్టర్లు ఉప్పల సాంబశివరావు, బి. ఎన్. మిత్ర, ఎన్. సాంబశివరావు, విమల కుమారి, వర్రె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## ఈసారి కూడా కందిపప్పు సరఫరా లేనట్లే



**గుంటూరు మేజర్ న్యూస్** : ఏపీలోని రేషన్ కార్డుదారులకు బ్యాడ్ న్యూస్ అనే చెప్పవచ్చు. వచ్చే నెల జూలై లోనూ రేషన్ కార్డుదారులకు కందిపప్పు అందేలా కనిపించడం లేదు. జులై నెలకు సంబంధించి నిత్యావసరాలు ఇప్పటికే చేరుకోగా ఈసారి కూడా కందిపప్పు సరఫరా లేదని అధికారులు చెప్తున్నారు. 2025 మార్చి నెల నుంచి ఏపీలో కందిపప్పు పంపిణీ ఆగిపోయింది. మార్కెట్లో కిలో కందిపప్పు ధర రూ.120 నుంచి రూ.160 వరకూ పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో తక్కువ ధర (రూ.67)కే లభించే కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# పనితీరు బాగా లేకుంటే గుడ్‌బై చెప్పేస్తా

- పార్టీ విస్తృత సమావేశంలో సీఎం చంద్రబాబు వెల్లడి
- ఆర్థిక ఉగ్రవాదులు రాజకీయాల్లోకి వస్తున్నారు
- ఎమ్మెల్యేలు నిత్యం ప్రజల్లో ఉండాలి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

వైకాపా హయాంలో రాష్ట్రం ధ్వంసమైందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించారని విమర్శించారు. తెదేపా, జనసేన, భాజపా ఎప్పటికప్పుడు సమన్వయంతో ముందుకెళు _న్నాయన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు ఆయన దిశానిర్దేశం చేశారు. పనితీరు బాగా లేకుంటే గుడ్‌బై చెప్పేస్తానని తేల్చిచెప్పారు.

**ప్రజలకు అందుబాటులో ఉండాలి**

"రాష్ట్ర విభజన వేళ అనేక సమస్యలు వచ్చినా నిలదొక్కుకున్నాం. వైకాపా పాలనతో రాష్ట్రం ధ్వంసమైంది. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తామని ప్రజలకు చెప్పాం. వారు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. ఐదేళ్లలో మనం ఏం చేయాలనేదానిపై ఇప్పటికే చర్చించాం. ఇచ్చిన మాట ప్రకారం సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రజల ఆకాంక్షలను మనం నెరవేర్చాలి. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి.. అది మన బాధ్యత. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. భవిష్యత్తులో ఏం చేస్తామో స్పష్టంగా చెప్పాలి. ఎన్నికల్లో దామాషా ప్రకారం అందరికీ న్యాయం చేశాం. సంక్షేమం అంటే ఏంటో చూపించిన పార్టీ మనది. ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకుని పరిపాలన చేశాం. చేసిన పనిని ప్రజలకు చెప్పడం ముఖ్యం. 2014-19 మధ్య చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయాం. సుస్థిర పాలన ఉంటేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమ వుతుంది.

**ఆగస్టు 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్‌లో 703 సేవలు**

బ్లాక్ మెయిల్ రాజకీయాలు మనం ఎప్పుడూ చేయం. కేంద్రం మనకు బాగా సాయం చేస్తోంది. సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయని చెప్పడం లేదు. ఇంకా చాలా పరిష్కరించాలి.. అదే మన



లక్ష్యం. సేవ, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యమివ్వాలి. ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచి ఇస్తున్నాం. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చి రైతులను ఆదుకుంటున్నాం. ప్రతి రైతుకూ రూ.20వేల సాయం చేస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభిస్తాం. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు మంజూరు చేశాం. రాజధాని ప్రాంతంలో పనులను పట్టాలెక్కించాం. పోలవరానికి రూ.12,500 కోట్లు కేంద్రం ఇచ్చింది. రాబోయే ఏడాదిన్నరలో ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 నాటికి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి రూ.11,400 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మరో నాలుగైదు నెలల్లో అది లాభాల బాట పడుతుంది. క్రిష్ సిటీలో పనులు ప్రారంభయ్యాయి. ఐటీ విప్లవాన్ని అందిపుచ్చు కున్నాం. వాట్సప్ గవర్నెన్స్‌తో సుమారు 500 సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్నాం. ఆగస్టు 15 నాటికి 703 సేవలు ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల అవినీతి తగ్గుతుంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పాలన అందించే అవకాశం ఉంటుంది. పాలసీలు ఎంత మంచివైనా అమలు చేయడంలో చిత్తశుద్ధి ఉండాలి. రాష్ట్రానికి అనేక పెద్ద కంపెనీలు వస్తున్నాయి. రాష్ట్రాన్ని 5 జోన్లుగా విభజించి అభివృద్ధి ప్రణాళిక తయారు చేస్తున్నాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి శ్రీకారం చుట్టాం.

**రాజకీయాల్లోకి ఆర్థిక ఉగ్రవాదులు వస్తున్నారు.. జాగ్రత్త**

భవిష్యత్తుపై ప్రజలకు నమ్మకం కలిగించే బాధ్యత మనపై ఉంది. ప్రజాసేవ చేసే కుటుంబాలను ప్రోత్సహిస్తున్నాం. నిత్యం ప్రజల మధ్య ఉంటేనే సాయం చేయగలం.. లేకుంటే ఏమీ చేయలేం. చిన్నచిన్న పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుందాం. మన ప్రవర్తన, అలవాట్లలో తప్పులుంటే మార్చుకుందాం. కొందరు ఎమ్మెల్యేలను పిలిచి వ్యక్తిగతంగా మాట్లాడుతున్నా. మొహమాటం లేదు.. వారి తప్పులు స్పష్టంగా చెబుతున్నా. రాజకీయాల్లోకి ఆర్థిక ఉగ్రవాదులు వస్తున్నారు.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. వివేకాను దారుణంగా చంపేసి అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమయ్యారు. నిందితులను అప్పుడే అరెస్ట్ చేసుంటే ఫలితాలు మరోలా ఉండేవి. కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశాం. ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా రాజకీయాలు చేస్తున్నారు. గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లను ఎవరైనా పరామర్శిస్తారా? జగన్ సత్తెనపల్లి పర్యటనలో కారు కింద వ్యక్తి పడినా కనీసం పట్టించుకోలేదు. తప్పులు చేస్తే ఆధారాలు చూపిస్తాం.. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు భద్రత కల్పించడమే మన ప్రథమ కర్తవ్యం.

**2029 ఎన్నికలేనా టార్గెట్**

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ చనిపోతే మనమే కారణమన్నారు. నిజం గడప దాటేసరికి అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందని గ్రహించాలి. ప్రజలకు వాస్తవాలు చెప్పడంతో నేతలంతా ముందుండాలి. సోషల్ మీడియా యుగంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. అక్కడ దారుణంగా వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. 2029 ఎన్నికలే నా టార్గెట్. పనితీరు బాగా లేకుంటే మొహమాటం లేకుండా గుడ్‌బై చెప్పేస్తా. వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు కౌంట్‌డౌన్ పెట్టుకుని పనిచేస్తున్నాం. ఏళ్లు.. నెలలు.. రోజులు.. గంటలు కూడా లెక్కిస్తున్నా. తానా, ఆటా అంటూ ఫారెన్ ట్రిప్పులు వద్దు. అలా వెళ్తే టాటా చెప్పేస్తా. ప్రజాప్రతినిధుల గ్రాఫ్ పెరుగుతుందా? తగ్గుతుందా? పరిశీలిస్తున్నా. మొదటి ఏడాది పాలన పూర్తయింది.. రెండో ఏడాది ప్రారంభైంది. నెల రోజులపాటు ప్రతి గడపకూ నేతలు వెళ్లాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో..!



**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఇటీవల ఆ పార్టీ నిర్వహించిన విస్తృత సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకున్నారు. తెదేపా అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమైందని ఈ నిరసన కార్యక్రమం సారాంశం... ఈ కార్యక్రమానికి రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో అనే పేరు పెట్టారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల ఇళ్ల గడప తొక్కలని తెదేపా ఎమ్మెల్యేలను ఆదేశించారు. ఈనెల 2 నుంచి ఈ కార్యక్రమం మొదలు కాబోతోంది. ఒక ప్రక్క హామీలు నెరవేర్చలేదని వైకాపా, మరో పక్క వైకాపాలనలో అరాచకం రాజ్యమేలిందని తెదేపా ఒకరిపై ఒకరు మాటల యుద్ధంతో కత్తులు దూస్తున్నారు. అయితే కొన్ని నియోజకవర్గాల్లోనే వైకాపా ఈ కార్యక్రమం చేపట్టబోతున్నట్లు తెలుస్తోంది...**

**- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

- వైకాపా వినూత్న కార్యక్రమం
- వైసీపీ విస్తృత సమావేశంలో నిర్ణయం
- 60 నియోజకవర్గాల్లో కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు

అధినేత జగన్ పిలుపు మేరకు శుక్రవారమే వైసీపీ శ్రేణులు "రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో" కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఎన్నికల్లో ముఖ్య మంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఆరోపిస్తూ ప్రతిపక్షం వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా "రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో" పేరుతో భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పార్టీ అధినేత జగన్ బుధవారం నిర్వహించిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏడాది పాలన ముగించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు జులై నుంచి ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి ఏడాదిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై వివరించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో వైసీపీ కార్యక్రమం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ప్రభుత్వం కంటే ముందుగా ప్రజల్లోకి వెళ్లి కూటమి పార్టీల చేతిలో ప్రజలు ఎలా మోసపోయారో చాటిచెప్పాలనేది ఆ కార్యక్రమం ఉద్దేశం. దీంతో రెండు పక్షాల కార్యక్రమాల నిర్వహణపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అధినేత జగన్ పిలుపు మేరకు శుక్రవారమే వైసీపీ శ్రేణులు "రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో" కార్యక్రమాన్ని ప్రారంభిం చాయి. పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావిస్తున్న ఈ కార్యక్రమం ఎన్ని నియోజకవర్గాల్లో జరుగుతుందనేది ఆసక్తి రేపుతోంది. రాష్ట్రంలో మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహిం చడం సాధ్యమయ్యే పనికాదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనికి కారణం దాదాపు 60 నియో జకవర్గాల్లో పార్టీకి నాయకత్వమే లేకపోయిందని అంటున్నారు. గత ఎన్నికల్లో ఇష్టం వచ్చినట్లు ఇన్ చార్జిలను మార్చడంతో చాలా చోట్ల ఇప్పుడు ఖాళీలు ఏర్పడ్డాయని అంటున్నారు. గత ఎన్నికల్లో అభ్యర్థులను మార్చే క్రమంలో వైసీపీ అధినేత దాదాపు 80 నియోజకవర్గాల్లో మార్పులు చేశారు. అప్పట్లో కొందరు సిటింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు నిరాకరించగా, మరికొందరిని పక్క నియోజక వర్గాలకు బదిలీ చేశారు. అయితే కొత్తగా పోటీకి దిగిన అభ్యర్థులు ఎన్నికల్లో ఓడిన అనంతరం పార్టీ వైపు చూడటమే లేదన్న టాక్ వినిపిస్తోంది. గెలిస్తే ఎమ్మెల్యే అవుదామని భావించిన వారు.. ఓడిపోయాక పార్టీని ఐదేళ్లు నడపడం భారంగా భావించి పార్టీ కార్యక్రమాలకు రావడం లేదని అంటున్నారు. మరికొన్ని చోట్ల స్థానికేతర నేతలు నియోజకవర్గ ఇన్చార్జి పదవుల్లో ఉండటంతో వారు కూడా పార్టీ కార్యక్రమాలకు ముఖం చాటేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా రాష్ట్రంలో దాదాపు 60 నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు నిర్వహణ సాధ్యమయ్యేలా లేదన్న ప్రచారం జరుగుతోంది.

# ప్రభుత్వ సేవలను మెరుగ్గా ప్రజలకు అందించాలి

**గుంటూరు, జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

కృత్రిమ మేధా ను వినియోగించుకొని ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించాలన్నా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా దేశంలోనే తొలిసారి రాష్ట్ర పోలీస్ శాఖ ఏఐ 4 ఆంధ్రా పోలీస్ హ్యాక్ థాన్ 2025ను విజయవంతంగా నిర్వహించిందని రాష్ట్ర డీజీపీ హరిష్ కుమార్ గుప్తా తెలిపారు. ఆదివారం సాయంత్రం చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జెసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఏఐ 4 ఆంధ్రా పోలీస్ హ్యాక్ థాన్ 2025 ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర డిజీపీ హరిష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాష్ట్ర డీజీపీ హరిష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జూన్ 27 నుంచి 29 వరకు నాలెడ్జ్ పార్టనర్ 4 సైట్ ఏఐ కంపెనీ, ఆర్వీఆర్ అండ్ జెసీ ఇంజనీరింగ్ కళాశాల హెూస్టింగ్ తో ఏఐ 4 ఆంధ్రా పోలీస్ హ్యాక్ థాన్ 2025 నిర్వహించటం జరిగిందన్నారు. హ్యాక్ థాన్ కు 160 మంది ధరఖాస్తు చేసుకోగా వాటిలో జనరేటీవ్ ఏఐ, ఎజెంటీక్ ఏఐ 60 కంపెనీలను, ఏఐ నిపుణులను ఎంపిక చేసుకొని కృత్రిమ మేధా సహాయంతో నేరాలు నియంత్రణ, పర్యవేక్షణ, దర్యాప్తు లోని సవాళ్ళుకు ఉత్తమమైన పరిష్కారాలను ఆవిష్కరించటం







జరిగిందన్నారు. రాష్ట్రంలోని 30 మందికి పైగా సీనియర్ ఐపీఎస్ అధికారులు, యువ ఐపీఎస్ లు నేరాల నియంత్రణ, దర్యాప్తులో ఉన్న అనేక సమస్యల పరిష్కారాలకు ఏఐ నిపుణుల సహాయంతో కృత్రిమ మేధాను వినియోగించుకునే ప్రక్రియ పై నిర్వహించిన కసరత్తు ఫలవంతమైందన్నారు. వీటిని రానున్న ఆరు నెలల్లో పోలీస్ శాఖలో అమలు పరిచి నేరాలను పటిష్టంగా నియంత్రించటంతో పాటు, ప్రజలకు పోలీస్ సేవలను మెరుగ్గా అందించటం జరుగుతుందన్నారు. భవిష్యత్తులోను పోలీస్ శాఖ కృత్రిమ మేధాను మరింతగా వినియోగించుకొనేలా ప్రణాళికలు రూపొందిస్తుందని, ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ శాఖలలో కృత్రిమ మేధాను వినియోగించటాన్ని పోత్సహిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. కృత్రిమ మేధాను పోలీస్ శాఖలో అమలు చేయటం ద్వారా నేరాలు జరగటానికి అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేసి నేరాలు నియంత్రించటం పాటు మోసాలకు, నేరాలకు పాల్పడే వారిని, సైబర్ నేరగాళ్ళను పోలీసులు అటోమోటిగ్గా ట్రాక్ చేసే వీలు కలుగుతుందన్నారు.

- రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా వెల్లడి
- ఏఐ4 ఆంధ్ర పోలీస్ హ్యాక్ థాన్ విజయవంతం

నేరాలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. 4సైట్ఏఐ సీఐఓ సూర్య కొత్తా మాట్లాడుతూ కృత్రిమ మేధాను వినియోగించుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర పోలీస్ శాఖ ఏఐ 4 ఆంధ్రా పోలీస్ హ్యాక్ థాన్ 2025 నిర్వహించటం ప్రపంచంలోనే తొలిసారి అన్నారు. ప్రభుత్వ శాఖలలో కృత్రిమ మేధాను అమలు చేయటం వలన తక్కువ శ్రమతో 24 గంటలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. రానున్న ఐదు సంవత్సరాల్లో జనరేటీవ్ ఏఐ, ఎజెంటిక్ ఏఐ లకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. కృత్రిమ మేధా లో నైపుణ్యాలు పెంపొందించుకోవటానికి ఆసక్తి ఉన్న ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులు 4సైట్ఏఐ సంస్థను సంప్రదిస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు. హ్యాక్ థాన్‌లో ఎనిమిది విభాగాల్లో నిర్వహించిన పోటీలలో విజేతలకు రూ. 75,000 ,రన్నర్లకు రూ. 50,000 చోప్పున మొత్తం రూ. 10 లక్షల విలువ కలిగిన నగదు బహుమతులు డిజిపి హరీష్ కుమార్ గుప్తా అందజేశారు.

---

# నకిలీ సీడ్.. అమ్మకాలు స్పీడ్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోకి ముందుగానే ప్రవేశిస్తున్న నేపథ్యంలో రైతులు పత్తి సాగుకు సిద్ధమవుతున్నారు. ఇదే అదనుగా దళారులు నిషేధిత బీజీ–3, లూజ్ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారు. పత్తి సాగులో ప్రధానంగా ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లాలే తొలి టార్గెట్.గా వ్యాపారు లు ఎంచుకున్నట్లు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే అతి విత్తనాలు నాటి సుమారు పది రోజులు కావస్తోంది. విత్తనాలు మొలిచి మొక్కలు అడుగు ఎత్తు ఎదిగిన చోట మాత్రం నీటి వసతి సరిగా లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కూడా చాలినంత లేవని చెబుతున్నారు. దీంతో కొంతమంది బోర్ల కింద, దూరంగా ఉన్న కాల్వలకు ట్యూబులు వేసి పత్తి పొలాలకు నీరు పెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితి పల్నాడు జిల్లాలో మాచర్ల, సత్తెనపల్లి, గురజాల, వినుకొండ, పెదకూరపాడు, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. రాష్ట్రంలో వానకాలం సీజన్‌లో అత్యధికంగా పత్తి సాగు చేసేది ఉమ్మడి గుంటూరు జిల్లాలో.నే ఇక్కడ వానకాలం సీజన్‌లో దాదాపు 2లక్షల హెక్టార్ల లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో పత్తి సాగయ్యే ఉమ్మడి జిల్లాల్లో పల్నాడు జిల్లాలోని ఆరు నియోజకవర్గంలో పాటు, గుంటూరు జిల్లాలోని తాడికొండ, ప్రత్తిపాడు, గుంటూరు రూరల్ మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా సాగవుతుంది. సీజన్ ప్రారంభానికి ముందే దళారులు ఈ జిల్లాలపై దృష్టి పెట్టి నకిలీ విత్తనాలను విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ద్వారాలు తీశారు. ఈ జిల్లాలో నకిలీ విత్తనాలు పెద్ద ఎత్తున రంగ ప్రవేశం చేసాయని వార్తలు వస్తున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆ దిశగా నిఘా పెట్టిన దాఖలాలు లేవు. తెలంగాణ, కొన్ని రాయలసీమ జిల్లాల నుంచి నకిలీ పత్తి విత్తనాలు పెద్ద ఎత్తున జిల్లాలోని అనేక ప్రాంతాల్లో కి చేరినట్లు చెబుతున్నారు. మంచి దిగుబడి వస్తుందనే నెపంతో ఆకర్షణీయమైన ప్యాకెట్లలో పత్తి విత్తనాలను నింపి బ్రాండెడ్ రకాల పేరుతో రైతులకు వ్యాపారులు అంటగడుతున్నారు. బిల్లు ఇచ్చిన దాఖలాలు కూడా ఉండటం లేదు. ఎవరైనా రైతులు బిల్లులు అడిగితే జిఎస్టి పడుతుందని చెప్పి రైతులను ఎడాపెడ కొంతమంది వ్యాపారులు మోసం చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు ట్రాన్స్పోర్ట్ లారీలు, పార్సిల్ లారీల్లో నకిలీ విత్తనాలను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పలు ట్రాన్స్పోర్ట్ ఆఫీసుల మీద దాడులు చేసి నకిలీ విత్తనాలను పట్టుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు ఈ దిశగా వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు ఏమాత్రం అడుగులు వేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి . ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద మొత్తంలో బీజీ%–%3 విత్తనాలు నిల్వ ఉన్నట్లు చెబుతున్నారు. పోలీసులు కూడా నకిలీ విత్తన వ్యాపారులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.గత.కొద్ది రోజుల క్రితం కర్ణాటక నుంచి కూడా నకిలీ విత్తనాలు కర్నూలు జిల్లాలోని చెక్ పోస్టులు దాటి పల్నాడు జిల్లా గుండా గుంటూరు జిల్లాలో కి విత్తనాలు తరలివచ్చినట్లు కూడా చెబుతున్నారు . ఈ విషయం వ్యవసాయ శాఖ అధికారులకు తెలిసినా కూడా పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి.గత కొంతకాలంగా నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తున్న వ్యక్తులే ఇప్పుడు కూడా విక్రయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ విత్తనాల అమ్ముతూ కట్టుబడిన వ్యాపారులు, దళారులు చట్టంలో ఉన్న లోసుగులను ఆధారం చేసుకుని బయటకు వస్తూ మళ్లీ ఇదే వ్యాపారాన్ని నడుపుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**నిషేధం మాటున దర్జాగా విక్రయాలు**

దేశంలో బీజీ–1, బీజీ–2 హైబ్రిడ్ విత్తనాలను మాత్రమే రైతులు సాగుచేయాలనే ఆంక్షలు ఉన్నాయి. భూసారం తీవ్రంగా దెబ్బ తినడంతో పాటు, వాతావరణ కాలుష్యానికి కారణమవు తుందన్న శాస్త్రవేత్తల సూచనల మేరకు దేశంలో బీజీ–3 రకాలను నిషేధించారు. అయితే వీటిని అక్రమంగా ఉత్పత్తి చేస్తున్న కొన్ని సంస్థలు.. ఏజెంట్ల ద్వారా నేరుగా రైతులకు సరఫరా చేస్తున్నాయి. తద్వారా పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. బీజీ–2 సాగుచేస్తే విత్తనం నాటిన 60 రోజుల తర్వాత దోమ పోటు ఉంటుందని, బీజీ–3 అయితే పంట దిగుబడి పూర్తయ్యేంతవరకు దోమపోటు, తెగుళ్ల తాకిడి ఉండదని, దిగుబడి సైతం బీజీ–2 కంటే 30 శాతం ఎక్కువగా వస్తుందని రైతులను నమ్మిస్తున్నారు. దీంతో రైతులు వీటివైపు ఆకర్శితులవుతున్నారు. అనేక చోట్ల రైతులు బీజీ–2తో కలిపి బీజీ–3 విత్తనాలను సాగుచేస్తున్నారు. జీబీ–3 సాగును వ్యవసాయ శాఖ అధికారులు నియంత్రించ లేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

**బీజీ–2 హైబ్రిడ్ విత్తన పాకెట్ ధర రూ. 901**

బీజీ–2 పత్తి విత్తన ప్యాకెట్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గత సంవత్సరం 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ. 864 ఉండగా, తాజాగా రూ. 37 పెంచి రూ. 901గా నిర్ణయించింది. ఏ కంపెనీకి చెందిన హైబ్రిడ్ విత్తన ప్యాకెట్ అయినా రూ. 901లకే రైతుకు విక్రయించాలి. ఈ నేపథ్యంలో లాభాల కోసం డీలర్లు దళారుల ద్వారా అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాల పేరుతో నిషేధిత బీజీ–3 లూజ్ విత్తనాలను కిలోకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేలకు విక్రయిస్తున్నారు. అదే సమయంలో తగిన దిగుబడి సామర్థ్యం లేవని పక్కన బెట్టిన విత్తనాలను తీసుకొచ్చి బీజీ–3 విత్తనాలతో కలిపి విక్రయిస్తున్నట్లు తెలంగాణ ప్రాంతంలో పోలీసుల నిర్వహించిన దాడుల్లో తేలింది. ఈ విత్తనాలు కర్ణాటక నుంచి ఆ రాష్ట్రానికి, దీంతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు ఈ నకిలీ విత్తనాలు వచ్చినట్లు తెలుస్తోంది.

**నాణ్యమైన బీజీ–2 విత్తనాలే నాటాలి : వ్యవసాయ శాఖ**

ఈసారి పత్తి సాగు చేసే ప్రాంతాల్లో బిజీ 2. ప్రత్తి పంటను సాగు చేయాలని ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడ పత్తి సాగు అవుతుందో కూడా అంచనా వేశారు ఇందుకోసం ఎక్కువ మొత్తంలో బీజీ–2 హైబ్రిడ్ విత్తనాలు అవసరం. ఉంటుందని గుర్తించి ఆ మేరకు విత్తనాలు సిద్ధం చేసినట్లు తెలిసింది. అయితే, ఈ సీజన్‌లో అన్ని పత్తి విత్తన కంపెనీల వద్ద ఉన్న విత్తనాలు అందుబాటులో కి. తెచ్చారు. రైతుల్లో కూడా కొన్ని లోపాలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులోకి తెచ్చిన విత్తనాలు కాకుండా తక్కువ రేటుకు వస్తున్నాయనే ఆశతో దళారులు, అక్రమ విత్తన వ్యాపారులు విక్రయిస్తున్న విత్తనాలను కొనుగోలు చేసి మోసపోతున్నారు. చాలామంది రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారే తప్ప బిల్లులు తీసుకోవడం లేదు. మీరు బిల్లును అడిగితే మేం బిల్లులు ఇస్తే జిఎస్టి ఎక్కువగా పడుతుందని రైతులను మభ్యపెడుతున్నట్లు సమాచారం. బిల్లు ఇవ్వకుండా పత్తి విత్తనాలను రైతులకు అంటగడుతున్న వ్యాపారులపై వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

---

# తుమ్మల చెరువు వద్ద విశాఖ ఎక్స్‌ప్రెస్ దోపిడీకి విఫలయత్నం

(మొదటి పేజీ తరువాయి)

గ్యాంగ్‌లు దొంగతనానికి పాల్పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఓపెన్ ప్రాంతం ఎక్కువగా ఉండటం, దొంగతనం చేసి తప్పించుకొని పోవడానికి మార్గాలు ఉండటంతో బీహార్, మహారాష్ట్రకు చెందిన దొంగల ముఠా ఈ ప్రాంతాన్ని అనువుగా చేసుకుని తరచూ రైళ్ల దోపిడీకి పాల్పడే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికితోడు నడికుడు నుంచి రైల్వే పోలీసులు కూడా నిఘా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ దొంగల ముఠా మాత్రం ఈ ప్రాంతంలో కాపు కాసి రైల్లో చొరబడి దోపిడీకి తరచూ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఈ దొంగల ముఠాలో ఏడుగురు సభ్యులున్నట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. ఇక, వారం రోజుల వ్యవధిలో ఈ ప్రాంతంలో దొంగల ముఠా ఇప్పటికే రైళ్లలో రెండు సార్లు దొంగతనం చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ దొంగతనాలకు పాల్పడే దొంగల ముఠాలను. గుర్తించేందుకు రైల్వే పోలీసు బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. గతంలో రైళ్లలో దొంగతనానికి పాల్పడిన పాత నేరస్తుల జాడలను కూడా పరిశీలిస్తున్నారు. తాజాగా ఆదివారం తెల్లవారుజామున దొంగల ముఠా విశాఖ రైలులో దోపిడీకి చేసిన ప్రయత్నం విఫలం కావడంతో రైల్వే పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా మూడోసారి ఆదివారం తెల్లవారుజామున దొంగతనానికి పాల్పడటంతో గాలిలోకి కాల్పులు జరిపినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతంలో తరచూ రైళ్లలో జొరబడి దోపిడీకి పాల్పడుతున్న దొంగల ముఠా ఆట కట్టించేందుకు రైల్వే శాఖ పోలీస్ అధికారులు గట్టిగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## నేడు డయల్ యువర్ కమిషనర్

**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్**



ఈ నెల 30వ తేది సోమవారం గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఉదయం 9:30 నుండి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అనంతరం “ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక” (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఉన్నందున జిఎంసి పార్కింగ్ దగ్గరలోని జనన మరణ నమోదు విభాగం ఎదురు మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### శ్రీ మహంకాళి అమ్మవారిని నిమ్మకాయలతో

## అలంకారం చేసిన పూజారులు



దుగ్గిరాల, మేజర్ న్యూస్ .దుగ్గిరాల మండల పరిధి లోని కంఠంరాజు కొండూరు గ్రామంలో గల శ్రీ మహంకాళి అమ్మవారు ఆషాఢమాసం మొదటి ఆదివారం నాడు నిమ్మ కాయల దండలతో అలం కరణ చేశారు. ఆషాఢ మాసం మొదటి ఆదివారం కావడంతో ఆలయ పూజా రులు శ్రీ మహంకాళి అమ్మ వారిని నిమ్మకాయలతో అలం కరణ చేయగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు, ప్రజలు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె. సునీల్ కుమార్, ట్రస్ట్ దేవ భక్తుని రంగ ప్రసాద్ ,ఆలయ అర్చకులు తారకనాథ్. సుబ్రమణ్య శర్మ ,మణిశర్మ ,ప్రదీప్ శర్మభక్తులు పాల్గొన్నారు.

### మహా న్యూస్ ఆఫీస్ పై దాడి

## పిరికి పంద చర్య

### - సంగీత రావు బొక్కా, న్యాయవాది, మాదిగ లాయర్స్ ఫెడరేషన్



నత్తెనపల్లి మేజర్ న్యూస్:మహా న్యూస్ ఆఫీసు పై జరిగిన గుండాల దాడిని న్యాయవాది బొక్క సంగీత రావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు, దౌర్జన్యాలకు స్థానం లేకుండా ఉ ండాలన్నారు. బెదిరింపులు, రౌడీ గుండాల దాడులతో మీడియాను కట్టడి చేయాలనే ఆలోచన మంచిది కాదని, దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోని నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలనీ పత్రిక సమావేశం లో తెలిపారు.

### జిల్లాలో రెచ్చిపోతున్న

## మహారాష్ట్ర,బీహార్ గ్యాంగ్



పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :గత అర్ధరాత్రి పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు వద్ద విశాఖ ఎక్స్ ప్రెస్ లో చోరీకి యత్నించిన దుండగులు దొంగలను చూసి మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపిన రైల్వే పోలీసులు కాల్పుల ధాటికి రైలు దిగి పారిపోయిన దుండగులు గతంలో మాదిరిగా వరుసగా రైళ్లలో చోరీకి పాల్పడుతున్న బీహార్, మహారాష్ట్ర గ్యాంగ్ ముఠాలో ఏడుగురు సభ్యులున్నట్లు గుర్తించిన పోలీసులు వారం రోజుల్లో రెండు సార్లు చోరి చేసేందుకు వచ్చిన ముఠా మహారాష్ట్ర, బీహార్ గ్యాంగ్ ల కోసం ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు.

### అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో

# ఉచిత మెడికల్ క్యాంపు

### • స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్







గుంటూరు సిటీ, మేజర్ న్యూస్ : బడుగు బలహీన వర్గాల ఆరోగ్య పరిరక్షణే తమ ధ్యేయమని ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, డాక్టర్ రాజకుమారి అన్నారు. బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం ఆళ్లవారిపాలెంలో వి ఎల్ ఎస్ ప్రసాద్ తల్లి గోవర్ధన్, విబి రావు తల్లి రామాయమ్మ జ్ఞాపకార్థం అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. స్త్రీ సంబంధిత సమస్యలు, ఇతర సమస్యలతో బాధపడుతున్న సుమారు 200 మంది స్త్రీ పురుషులు ఈ శిబిరాన్ని ఉపయోగించుకున్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలోని పేద ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు వేసవికాలం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తల్లి, బిడ్డ క్షేమం, సులువు ప్రసవం అయ్యే మార్గాలు, వ్యాయామం, ఆహార జాగ్రత్తలు తల్లి తీసుకోవాల్సిన వ్యాక్సినేషన్ గురించి అవగాహన కల్పించారు. వైద్య పరంగా పేద ప్రజలకు ప్రభుత్వాలు చేస్తున్న సేవలలో భాగంగా తమ వంతు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఉమా శంకర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోయ ప్రియాంక,డాక్టర్ గౌతమ్, అహల్య హాస్పిటల్ స్టాఫ్,ఆళ్లవారిపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు, అశోక్, వెంకటేష్, టీఎస్. ప్రసాద్, బి.సీతారామయ్య, విబి రావు పాల్గొన్నారు.

## బీజేఆర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు



తెనాలి, మేజర్ న్యూస్ : పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన మాదిగ విద్యార్థులను వారి తల్లితండ్రులను బీజేఆర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 525 మార్కులకు పైబడి మార్కులు సాధించి విద్యార్థులను స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 35 మండలాల నుంచి విచ్చేసిన 120 మంది సన్మాన గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు బహుమతి, బ్యాగ్, వాటర్ బాటిల్, డిక్షనరీ లు బహుకరించారు. భవిష్యత్‌లో విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. తమ అభిరుచులకు తగినట్టుగా లక్ష్యం ఏర్పరచుకుని సాధించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీఎస్టీ ఆడిట్ కమీషనర్ ఆనంద్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినా, ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి విజయ్ బాబు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి మధు బాబు, తెనాలి మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, 32 వ వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, బీజేఆర్ కమిటీ గౌరవా ధ్యక్షులు అత్తోట శరత్ బాబు, అధ్యక్షులు మేకల సురేష్, సెక్రెటరీ సద్గుణరావు, ట్రెజరర్ సిద్దెల కమలాకర్, నలుకుర్తి రమేష్ , అత్తోట శ్యాం పాల్గొన్నారు.

## మహా న్యూస్ పై జరిగిన దాడిని ఖండించిన :జీవి



వినుకొండ మేజర్ న్యూస్: సమాజంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చూడటంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహా న్యూస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ప్రజలకు నిజాలను తెలుసుకునే హక్కు ఉంది. మీడియా ఆ నిజాలను ప్రజలకు చేరవేస్తుంది., ఈ దాడి ద్వారా మీడియాను భయపెట్టి, నిజాలను బయటపెట్టకుండా అడ్డుకోవాలని చూశారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. జర్నలిస్టులపై దాడులు జరిగితే, వారు స్వేచ్ఛగా వార్తలను సేకరించి, ప్రచురించలేరు. వారి భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేయాలనీ,ఎవరైనా సరే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం తీవ్రమైన నేరం. ఈ దాడిలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇది సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుందనీ.ఇటువంటి దాడులను ఉపేక్షిస్తే, ప్రజల్లో భద్రతా భావం తగ్గుతుంది. అసలు దోషులను పట్టుకుని శిక్షించడం ద్వారా, చట్ట పాలన పట్ల ప్రజలకు విశ్వాసం పెరుగుతుందనీ తెలిపారు.ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు, అన్ని సంస్థలకు న్యాయం అందించాలి.మీడియా కు రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతల్లో ఒకటినీ,ఈ దాడి వెనుక ఉన్న అసలు కారణాలను నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయించాలి. దాడికి పాల్పడిన వారిని, అందుకు ప్రేరేపించిన వారిని కూడా గుర్తించి చట్ట పరంగా శిక్షించాలని ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మీడియా సంస్థలకు అవసరమైన భద్రతను కల్పించాలన్నారు..

### పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటానికై

# జరిగే ఆందోళనను జయప్రదం చేయండి

## - రైతు సంఘాల డిమాండ్



మేజర్ న్యూస్ పెదనందిపాడు: పెదనందిపాడు, కాకుమాను మండలాలలో వెంటనే పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు కోరారు. జూలై 1వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం పెదనందిపాడు తహసిల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్రతో కలిసి ఆదివారం పలు గ్రామాలలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. పెదనందిపాడు మండలంలోని నాగులపాడు, పెదనందిపాడు , వరగాని, అన్నపర్రు, కొప్పర్రు, అబ్బినేని గుంట పాలెం, రాయపాడు, గోగులమూడి, కట్రపాడు, కాకుమాను మండలంలోని కొమ్మూరు, పెద్దివారిపాలెం గ్రామాల్లో పొగాకు రైతులను కలిసి మంగళవారం పెదనందిపాడు లో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెదనందిపాడు మండల రైతులను గుంటూరు చుట్టగుంట వద్దకు, కాకుమాను మండల రైతులను పెదకాకాని వద్ద ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల వద్దకు పొగాకును తీసుకురమ్మంటున్నారని, అంత దూరం వెళ్లడానికి రవాణా ఖర్చులు అధికంగా అవుతున్నాయని, రిజెక్ట్ అయితే వెనక తీసుకురావడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పొగాకు పండించిన చోట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా, 50 కిలోమీటర్ల దూరంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. స్థానికంగా పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పోపూరి సుధీర్, శాఖమూరి రంగనాయకులు, మదమంచి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### కంభంపాడు-జలాలపురం

# లింకు రోడ్డు బ్రిడ్జి పనులు పూర్తి



పెదకూరపాడు (మేజర్ న్యూస్) : మండలం కంభంపాడు నుంచి జలాలపురం వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డులో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ లింకు రోడ్డు ద్వారా గుంటూరు వెళ్లేందుకు సమయం ఆదా అవుతుందని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోని ఈ బ్రిడ్జి రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చినందుకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

### రేవుల్లో పడవ సుంకాలకు

# జులై 3న వేలం పాటలు



అచ్చంపేట (మేజర్ న్యూస్) : మండల పరిధిలోని చింతపల్లి, గింజుపల్లి పడవలు, మాదిపాడు బల్లకట్టుకు 9 నెలల కాలపరిమితికి సంబంధించి జులై 3న పాటలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ శ్వేతా బసు తెలిపారు. గురువారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2:30 వరకు సీల్డ్ టెండర్లు స్వీకరిస్తామని, అనంతరం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆమె వివరించారు.

# మమ్ములను అన్యాయంగా తొలగించారు



## - 7 గురు అధ్యాపకులం రోడ్డున పడ్డాం ఉన్నతాధికారులు న్యాయం చేయాలి

## - ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ కు సహకరించకపోవడమే మా శాపమా

మాచర్ల ప్రతినిధి/విజయపురిసౌత్ న్యూస్ :మాచర్ల మండలం నాగార్జునసాగర్ ఏపీఆర్జేసీలో గత 15 సంవత్సరాలుగా అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న తమను విధులనుంచి అకారణంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్ సరోజిని తొలగించిందని అతిథి అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. ఈనెల 2వ తేదీ నుంచి కళాశాలలు ప్రారంభం కాగా తమను కళాశాలకు రానివ్వకుండా ఎటువంటి సమాచారం లేకుండానే పూర్తిగా తొలగించి అప్పటికప్పుడు ప్రిన్సిపల్ నోటిఫికేషన్ విడుదల చేసి తమను అన్యాయం చేసిందంటూ వారు వాపోయారు. స్థానిక కళాశాలలో ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న దాసరి వీరేష్, ఆర్.మధు, శ్రీనునాయక్, మస్తాన్, రమేష్ నాయక్, సునీతలు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి మంచి ఉత్తీర్ణతశాతం తీసుకొచ్చేందుకు తాము కృషి చేశామన్నారు. చాలిచాలని జీతాలతో తాము ఎంతో కష్టపడి విద్యాభివృద్ధికి కృషి చేశామన్నారు. ఐతే ఈ ఏడాది ప్రిన్సిపల్ సరోజని ఇంటర్ పరీక్షల సమయములో తామందరినీ ఆఫీసుకు పిలిపించి ఈ సంవత్సరం పరీక్షలలో మన కళాశాలకు 100 శాతం ఉత్తీర్ణత రావాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. కాని ఇందుకు భిన్నంగా ఇంటర్ పరీక్షలలో తాము నిస్వార్ధంగా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేశామన్నారు. ఈ క్రమంలో కళాశాలకు ఉత్తీర్ణత శాతం తగ్గిందన్నారు. ఇంటర్ ఫలితాలు కళాశాలకు సక్రమంగా రాక తగ్గడంతో సదరు ప్రిన్సిపల్ అతిథి అధ్యాపకులమైన మాపై ఆగ్రహంతో ఎటువంటి సమాచారం లేకుండా మా 7 గురిపై వేటు వేసిందన్నారు. దీనిపై తొలగించిన 7 గురు అతిథి అధ్యాపకులమైన మేము ప్రిన్సిపల్ ను కలిసి తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరగా ఆమె %ూ్యా. =.జు. ×.ూ%. కార్యదర్శి అతిథి అధ్యాపకులను తీసుకోవాలని నోటిఫికేషన్ జారీ చేయక ముందే తానే ముందస్తు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ తమకు తీవ్ర అన్యాయం చేశారని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అతిథి అధ్యాపకులు కోరుతున్నారు.

# ఘనంగా శ్రీ గంగానమ్మ తల్లి కొలుపుల మహోత్స వాలు



దుగ్గిరాల, మేజర్ న్యూస్ . దుగ్గిరాలగ్రామం లోని జిల్లా పరిషత్ పాఠశాల వెనుక తుంగభద్ర కాల్వకట్ట సమీపంలో ఉన్న శ్రీ మహా కాళీ మహాలక్ష్మి మహా సరస్వతి శ్రీ శక్తి స్వరూపిణి గా కొలవబడుతున్న శ్రీ గంగానమ్మ తల్లి కొలుపుల మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి .కొల్లిపర పుట్టా స్వామి వెంకట సునీల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం, బోనాలొత్సవం గ్రామంలో. ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు . ఉదయం అమ్మవారికి విఘ్నేశ్వర పూజ ,పుణ్య హవాచనం ,దీక్ష, ఆరాధన, మండపారాధన ,అభిషేకం ,అర్చన, పూజ ,చండి హోమం పూర్ణాహుతి తో పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు .ముందుగా గ్రామంలో పసుపు కుంకుమ బోనాల తో మహిళలు తమ ఇంటి నుండి బయలుదేరి ముత్తయిదువులతో ఊరేగింపుగా గంగానమ్మ తల్లి దేవాలయం కు చేరుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామంలో బోనాల ఉత్సవంతో మహిళలతో భక్తులతో కళకళలాడింది.

# ఎంపీ లావును కలసిన ఎల్జేపీ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ



సత్తెనపల్లి మేజర్ న్యూస్: నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలను ఆదివారం లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ గుంటూరులో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, సమస్యలు తదితర విషయాల పై కొద్ది సేపు మాట్లాడారు. ప్రజా సమస్యలు, తదితర పనులేమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కరానికి తన వంతుగా కృషి చేస్తాన్నారు. నాయకులు కారుమంచి గంగరాజు, మహంకాళి వెంకట్రావ్, దుగ్గి విజయ్ కుమార్, జొన్నలగడ్డ జీవా , పూసల రాజేంద్ర, మాబు వలి, శ్రీనివాసరావు, యశ్వంత్ తదితరులు ఎంపీ ని కలిసిన వారిలో ఉన్నారు.



## అమరావతి కాలచక్ర రహదారిపై
# వాహనదారుల అవస్థలు

అమరావతి (మేజర్ న్యూస్) : సత్తెనపల్లి–అమరావతి కాలచక్ర రహదారిపై లింగాపురం వద్ద రోడ్డు డైవర్షన్ వాహనదారులకు ఇబ్బందులు సృష్టిస్తోంది.బ్రిడ్జి పనుల కారణంగా దారి మళ్లించడంతో,నిత్యం వేలాది వాహనాలు పంట పొలాలు, వెంచర్ల గుండా వెళ్లాల్సి వస్తోంది.దీంతో ప్రయాణం కష్టతరంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## మహాన్యూస్ ఆఫీసుపై
# దాడిని ఖండించిన కన్నా



సత్తెనపల్లి మేజర్ న్యూస్ : ఆఫీసుపై దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణమని మాజీ మంత్రి సత్తనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దాడులకు దౌర్జన్యాలకు చోటు లేదు. బెదిరింపులు, దాడులతో మీడియాను కట్టడి చేయాలనే ఆలోచన మంచిది కాదన్నారు. ప్రజలు, సమాజం దాడులను ఆమోదించదు.దానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలనితెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.కథనాలు ప్రసారాలు పట్ల అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చున్నారు.మహాన్యూస్ యాజమాన్యం, సిబ్బందికి సంఘీభావం తెలియజేసారు .

## మహా టీవీ కార్యాలయంపై దాడి
# ప్రజాస్వామ్యానికే అవమానం
## - మండల సీపీఐ కార్యదర్శి కేతావత్ రంగనాయకులు

రెంటచింతల మేజర్‌న్యూస్ : పత్రికా స్వేచ్ఛను అణచి వేయడానికి బిఆర్ఎస్ దాడులకు దిగిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని రెంటచింతల మండల సీపీఐ కార్యదర్శి కేతావత్ రంగ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ స్వతంత్రంగా పనిచేస్తున్న మహా



టీవీ మీడియా కార్యాలయంపై జరిగిన ఈ దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్యగా చూస్తున్నామని, మీడియా సంస్థలపై దాడులు చేయడం అనేది ప్రజాస్వామ్యానికే అవమానం అని, ఇది ఒక్క మహా టీవీ సంస్థపై కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి అని పరిగణించాలని ఇటువంటి దాడులకు పాల్పడినవారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలన్నది మా డిమాండ్ ఇటువంటి చర్యలు మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నాం అని తెలిపారు.

## మైనింగ్ మాఫియాను అడ్డుకున్న
# జనసేన పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు

పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :చిలకలూరి పేట నియోజకవర్గం,కొండవీడు ప్రాంతములోని అటవీశాఖ భూములలో జరుగుతున్న అక్రమ మట్టి మైనింగ్ మాఫియాను అడ్డుకున్న జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు.గత కొన్నేళ్లుగా జరుగుతున్న మట్టి మాఫియాను అరికట్టాలని స్థానిక గ్రామాల ప్రజలు నియోజకవర్గం పార్టీ నాయకులతో కలసి జిల్లా కార్యాలయానికి ఫిర్యాదు చేయడముతో శనివారం పార్టీ నాయకులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.అటవీ, ప్రభుత్వ భూముల్లో 6 జేసీబీ లు, 15 టిప్పర్ లారీలతో మట్టి మాఫియాను చూసి నివ్వెర పోవడం జరిగింది.చారిత్రక ప్రాంతమైన కొండవీడులో కూటమి ప్రభుత్వ పరిపాలనలో పట్టపగలే అక్రమమట్టి త్రవ్వటాన్ని జనసేనపార్టీ ఖండిస్తుందని గాదె వెంకటేశ్వరరావు అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అవినీతి రహిత పాలన కోసం పాటుపడుతుంటే , దానికి విరుద్ధముగా ఇక్కడ అవినీతి మాఫియా రాజ్యమేలుతోంది. స్థానిక తహశీల్దార్ కి ఫిర్యాదు చేసిన ఇంతవరకు ఇక్కడకు రాలేదన్నారు. జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన ఏ అధికారి ఇక్కడకు రాలేదు అస్సలు ఈ ప్రాంతములో ఏమి జరుగుతుందని అర్థం కావట్లేదు. మా అధినేత పవన్ కళ్యాణ్ ఎప్పుడు చెప్తుంటారు కూటమి ప్రభుత్వములో అవినీతి జరుగుతుంటే దానిని అడ్డుకుంటామని , అడ్డుకోమని సూచించారు.జనసేనపార్టీ ప్రజల పక్షానమాత్రమే నిలుచుంటుందని , మా నాయకులు పవన్ కళ్యాణ్ చెప్పిన బాటలోనే నడుస్తామని తెలియజేశారుస్థానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుదృష్టికి ఈవిషయాన్ని తీసుకువెళ్లి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతామని అన్నారు.రాజధాని ప్రాంతములో చరిత్రాత్మక ప్రాంతమైన కొండవీడులో పట్టపగలే ఇంత మాఫియా జరుగుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తి నట్టు ప్రవర్తించడం పై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. అక్కడ ఉన్న గురుకుల పాఠశాల, వసతి గృహం ఉందని, ఈ మైనింగ్ వలన వచ్చే కాలుష్యం తో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని వారు తెలుపుతున్నారు. ఈ ప్రాంతానికి వచ్చిన తరువాత జనసేన శ్రేణులులను చూసి టిప్పర్లు డ్రైవర్లు, ప్రోక్ లైనర్ డ్రైవర్లు పారిపోయారు వాటి తాళాలను స్థానిక వీఆర్వో కి అందచేయమని తాసిల్దార్‌తెలపడంతోతాళాలను మీడియా సమక్షంలో విఆర్ఓకి అందజేయడం జరిగింది. స్థానిక సమరయకర్త తోట రాజ రమేష్, జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శిఖా బాలు,జిల్లా సంయుక్త కార్యదర్శి సుభాని, బంధాల జ్యోతి,మండల అధ్యక్షులు పఠాన్ ఖాదర్బాషా, మునీర్ హసన్, మండల ఉపాధ్యక్షులు మేకల రామారావు, దరదాసుల శరత్, మండల నాయకులు బాపన హనుమంతరావు,తోట నాని, వీరాంజనేయులు, కుంచలపల్లి సాంబశివరావు,గోశాల విజయ్,అనిత, ఏసుబాబు , ఆముదాల లీలా కిషోర్, కూరపాటి శివశంకర్, సాంబ స్థానిక గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# పరిమితులు లేని పని విధానం అమలుకు కుట్రలు

- ఆశాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు
- జిల్లా ప్రధాన కార్యదర్శి డి శివకుమార్

నరసరావుపేట మేజర్ న్యూస్ :కార్మిక, కర్షక అణగారిన వర్గ ప్రజల సంక్షేమం కోసం వచ్చే నెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఏపి ఆశా వర్కర్ యూనియన్(సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివ కుమారి పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో యూనియన్ నాయకులు ఎం.రత్నకుమారి అధ్యక్షతన సార్వత్రిక సమ్మె జయప్రదంకై జరిగిన సన్నాహక సమావేశంలో శివకుమారి మాట్లాడుతూ కేంద్రంలో వరుసగా 3వ సారి అధికారంలోకి వచ్చిన మోడీ కార్మిక చట్టాలను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికుల జీవితాలను పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టే కుట్రలు చేస్తున్న మోడీ విధానాలను చైతన్యంతో త్రిప్పికొట్టాలని లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, ఆశాలను కార్మికులుగా గుర్తించాలని కనీస వేతనం చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేక నిర్ణయాలకు, పరిమితులు లేని 14 నుండి 20 గంటల పని విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తూ పని గంటల పెంపు విధానం, రాత్రి సమయంలో మహిళలతో పని చేయించాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని అవహేళన చేస్తూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్మికవర్గానికి తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు పని ఒత్తిడి పెరిగిందని, రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తుందన్నారు. రాష్ట్రంలో 15 ఏళ్ల నుండి వేతనాలు పెరగలేదని పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని లేబర్ కోడ్ లు అమలైతే కార్మికులు పోరాటాలు చేసే హక్కు కోల్పోతారని వారాంతపు సెలవులు, పిఎఫ్ ఈఎస్ఐ లు, ఉండవని యూనియన్లు గుర్తింపు రద్దు చేస్తారని, కార్మిక వర్గానికి ఎటువంటి భరోసా ఉండదన్నారు. గత ప్రభుత్వంలో అంగీకరించిన డిమాండ్స్ కు వెంటనే జీవో విడుదల చేసి గత 20 ఏళ్ళుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలో అందిస్తున్న ఆశా వర్కర్స్ కు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయాలన్నారు. ఆశాల ఆందోళన ఫలితంగా వేతనంతో కూడిన సెలవులు, వయోపరిమితి పెంపు తదితర సమస్యల పరిష్కరిస్తామని అంగీకరించిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎం.భూలక్ష్మి, డి రత్నకుమారి, టి అంకమ్మ అధిక సంఖ్యలో ఆశాలు పాల్గొన్నారు....

# గంజి వీరాస్వామికి భారత ప్రతిభా సేవా పురస్కారం



సత్తెనపల్లి మేజర్ న్యూస్: నిస్వార్థ సేవకు, అంకితభావానికి నిదర్శనంగా నిలిచిన గంజి వీరాస్వామి కి ప్రతిష్టాత్మకమైన భారత ప్రతిభా సేవా పురస్కారం లభించింది. గత రెండున్నర దశాబ్దాలుగా సమాజ సేవలో నిరంతరం కృషి చేస్తున్న వీరాస్వామి సేవలను గుర్తించిన ఎల్.సి.ఈ.ఎఫ్ ఫౌండేషన్, కూచిపూడి నాట్య సమ్మేళనం సందర్భంగా ఈ గౌరవాన్ని అందించింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో జూన్ 29, 2025న జరిగిన అంగరంగ వైభవమైన వేడుకలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గంజి వీరాస్వామి కి ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల వారి శ్రేయోభిలాషులు, మిత్రులు అపారమైన ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ శుభ సందర్భంలో కట్టా శివ దుర్గారావు, వంగర మధు, వంగర శ్రీనివాసరావు, అవ్వారు ఏడుకొండలు వంటి పలువురు ప్రముఖులు వీరాస్వామి ని అభినందించడమే కాకుండా, వారి అకుంఠిత సేవానిరతిని ప్రశంసించారు.ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు వీరాస్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ గౌరవాన్ని అందించిన ఎల్.సి.ఈ.ఎఫ్ ఫౌండేషన్ సంస్థకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి, సమాజ శ్రేయస్సు కోసం మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా వీరాస్వామి పునరుద్ఘాటించారు.

# మానత్వానికి ప్రతీకగా నిలిచిన మానవత స్వచ్ఛంద సంస్థ

## • నగర కమీషనర్ పులి శ్రీనివాసులు





గుంటూరు, మేజర్ న్యూస్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గత మూడు సంవత్సరాలుగా గుంటూరులో బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలిచిందని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం గుంటూరులోని బాలాజీ కళ్యాణ మండపంలో జరిగిన మానవత 3వ వార్షికోత్సవ కార్యక్రమానికి పులి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గుంటూరు నగరంలో 5 లక్షల మొక్కలను నాటి హరిత గుంటూరుగా మార్చాలనే సంకల్పంలో మానవత భాగస్వామ్యం కావాలని కోరారు. మానవత లాంటి స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని గుంటూరు నగరాన్ని పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మానవ సంబంధాల విశిష్టతను తెలిపే రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన కవితను చదివి వినిపించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు ప్రసంగిస్తూ 2004లో 108 మంది సభ్యులతో ప్రారంభమైన మానవత నేడు 132 శాఖలకు విస్తరించి, 80 వేల సభ్యులతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం గొప్ప పరిణామమన్నారు. వార్షిక సభ్యత్వం 600 రూపాయలు చెల్లించి మానవతలో సభ్యులుగా చేరి సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటును అందించాలని కోరారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 1990వ దశాబ్దంలో అక్షరాస్యత ఉద్యమంలో ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు సమిష్టిగా కృషి చేయడం వలన ఆ దశాబ్దంలో 17 శాతం అక్షరాస్యత పెరిగిందని, నేడు ఈ ప్రయోగాన్ని పునరావృతం చేసి అక్షరాస్యతలో 32వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను అక్షరాంధ్రప్రదేశ్ గా మార్చాలన్నారు. మానవత లాంటి పలు సంస్థలు గుంటూరు నగరంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని, వీటన్నింటిని కలుపుకుని గుంటూరులోని పేద ప్రజల అభివృద్ధికి కృషి చేయా లన్నారు. గుంటూరు నగర కమిషనర్ నగరంలోని సమస్యలను ఎత్తి చూపడానికి, పరిష్కరించడానికి తోడ్పడే వాట్సాప్ గ్రూప్ ను రూపొందించి ,సక్రమంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, తెనాలి, పొన్నూరు, బాపట్ల లో మానవత శాఖలు ఏర్పడి పనిచేస్తున్నాయని, త్వరలో మరో 5 పట్టణాలలో మానవత శాఖలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సర్వసభ్య సమావేశం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షునిగా డా.కోట శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా డా.పి. కల్పన, కార్యదర్శిగా కె. సతీష్ బాబు, కోశాధికారిగా టీ. వి. సాయిరాం, సంయుక్త కార్యదర్శిగా కర్నాటి ఆనంద్ లను ఎన్నుకొని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మానవత పూర్వ అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీనివాసరావు, మెడికల్ విభాగ చైర్మన్ టి. ధనుంజయ రెడ్డి, విద్యా విభాగ చైర్మన్ ఎన్. అరవింద్, అవయవ దాన చైర్మన్ టి. సుందర రామయ్య, డైరెక్టర్లు ఉప్పల సాంబశివరావు, బి. ఎన్. మిత్ర, ఎన్. సాంబశివరావు, విమల కుమారి, వర్రె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# వ్యాపార వర్గాల ఉన్నతికి ప్రభుత్వం చేయూత

గుంటూరు, మేజర్ న్యూస్ : వ్యాపార వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరు భాస్కరరావు అన్నారు. ఇటీవల నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరర్ అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన గుడివాడ జయకుమార్, కార్యదర్శి ఎం కోటేశ్వరరావు, కోశాధికారి వై బి శివారెడ్డిల ప్రమాణ స్వీకారం ఆదివారం పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్ లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేసిన పొట్లూరు భాస్కరరావు నూతన కార్యవర్గం చే ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. అసోసియేషన్ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తామన్నారు. నూతన రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన గుడివాడ జై కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. భవిష్యత్తులో అసోసియేషన్ తరపున నూతన భవంతిని నిర్మించి నిరుద్యోగ యువతకు ప్లాస్టిక్ టెక్నాలజీ లో మెలకువలను నేర్పించుతోపాటు ఉచిత శిక్షణ తరగతులు ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు నూతన కార్యవర్గానికి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## తెదేపా విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న నర్సరావుపేట ఎంపీ



గుంటూరు, మేజర్ న్యూస్ :కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని గడప గడపకు తీసుకు వెళ్లేందుకు "సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం" పై, తెలుగుదేశంపార్టీ సంస్థాగత నిర్మాణంపై.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళగిరిలోని జాతీయ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత, ఎఫ్‌సిఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్, గౌరవ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

## గుంటూరులో టాక్స్ ప్రాక్టీషనర్స్ సమావేశం

గుంటూరు, మేజర్ న్యూస్ : ఆదివారం గుం టూరులోని, గొట్టి పాటి కళ్యాణ మండ పంలో జరిగిన ' ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్& కన్సల్టెంట్స్ అసోసియేషన్ గుంటూరు వార్షిక జనరల్ బాడీ మీటిం గ్ లో టీడీపి పార్లమెంటరీ పార్టీ నేత, ఎఫ్ సి ఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో ఆడిటర్స్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వానికి పన్నులు కట్టడంలో ప్రజలను గైడ్ చేస్తూ ఆడిటర్స్ ప్రధాన పాత్ర పోషించటం వల్ల.. గత పదేళ్లలో పన్నులు చెల్లించే వారి శాతం గణనీయంగా పెరిగింది. ఆడిటర్స్ వారి సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే.. పరిష్కారానికి కృషి చేస్తాం. అని చెప్పారు.

## నేడు తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలి, మేజర్ న్యూస్ :మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో 11.30 గంటలకు జరగనున్న సమావేశానికి కౌన్సిల్ సభ్యులు పాల్గొనాలని ఆమె కోరారు. సమావేశంలో ఎజెండా లో పొందుపరిచిన 24 అంశాలపై చర్చ జరుగుతుందని ఆమె తెలిపారు.





### న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో

# జాతీయ లోక్ అదాలత్

పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆదేశానుసారం 2.05.07.2025 2 నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించు చున్నాము. నరసరావుపేట కోర్టుల పరిధిలో ఉన్న అన్ని సివిల్ కేసులను, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, బ్యాంక్ కేసులను, రెవిన్యూ కేసులను, మోటార్ వాహన ప్రమాద కేసులను, చెక్కు బౌన్స్ కేసులను, భరణం కేసులను, కుటుంబ తగాదాలను మరియు ముందస్తు వ్యాజ్యపు కేసులను పరిష్కరించెదము. కావున ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని తమ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకొని సమయమును, డబ్బును ?దా చేసుకొనగలరని ఆశిస్తున్నాము. సివిల్ కేసులను లోక్ అదాలత్ లో రాజీ చేసుకున్నట్లయితే కోర్టు ఫీజు వాపసు చేయబడును. కాసులు, రాజీ చేసు కోవడానికి వచ్చే వచె కక్షిదారులకు అల్పాహారం, నీరు ఏరాఎట్లు చేయడమైనది. ఈ అవకాశాన్ని అందరు వినియోగించు కావలసినదిగా కొరడమైనది...

### మహా టీవీ కార్యాలయంపై

# దాడిని ఖండించిన ఎమ్మెల్యే డా.చదలవాడ



నరసరావుపేట మేజర్ న్యూస్ : పత్రికా స్వేచ్ఛను అణచివేయడానికి బిఆర్ఎస్ దాడులకు దిగిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం స్వతంత్రంగా పనిచేస్తున్న మహా టీవీ మీడియా కార్యాలయంపై జరిగిన ఈ దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్యగా చూస్తున్నాం మీడియా సంస్థలపై దాడులు చేయడం అనేది ప్రజాస్వామ్యానికే అవమానం ఇది ఒక్క మహా టీవీ సంస్థపై కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి అని పరిగణించాలి ఇటువంటి దాడులకు పాల్పడినవారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలన్నది మా డిమాండ్ ఇటువంటి చర్యలు మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

## జగన్ గారూ... మీ ఏడుపులే మాకు దీవెనలు:

- మంత్రి నారా లోకేశ్ కౌంటర్
- విద్యా వ్యవస్థపై జగన్ విమర్శలకు మంత్రి లోకేశ్ రిప్లయ
- విద్యా వ్యవస్థను ఐదేళ్లుగా భ్రష్టుపట్టించింది మీరేనని ఆరోపణ



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన విమర్శలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. "జగన్ గారూ.. మీ ఏడుపులే మాకు దీవెనలు" అంటూ వ్యంగ్యంగా బదులిచ్చారు. తాము చేపడుతున్న సంస్కరణలు చూసి ఓర్వలేకే జగన్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఏపీలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది... అందుకు ఏపీఈసెట్ అడ్మిషన్లే నిదర్శనం అని జగన్ చేసిన విమర్శలకు లోకేశ్ కౌంటర్ ఇచ్చారు. "మీరు ఐదేళ్లు విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసి పోయారు. నేను ఏడాదిలోనే అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడిన పెట్టడం చూసి మీకు కడుపుమంట రావడం సహజం. మీ హయాంలో ఎప్పుడు కౌన్సిలింగ్ పెట్టారో కూడా మీకు స్పృహ లేదు. కోవిడ్ తరువాత 2022 సెప్టెంబర్‌లో, 2023 జూలై చివరికి ఈసెట్ కౌన్సిలింగ్ పూర్తి చేసిన మీరు మమ్మల్ని విమర్శించటం మీ అజ్ఞానానికి నిదర్శనం. మేము ప్రభుత్వంలోకి రాగానే ఈసెట్ మొదటి కౌన్సిలింగ్‌ని జూలై మూడో వారం కల్లా పూర్తి చేశాం. ఈ సంవత్సరం కూడా మొదటి కౌన్సిలింగ్‌ని జూలై మూడో వారానికి పూర్తి చేస్తాం" అని లోకేశ్ వివరించారు.

## మహా టీవీపై దాడిని ఖండించిన శాలివాహన సంఘ యువసేన



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** మహాటీవీ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నట్లు నవ్యంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన యువసేన మీడియా కమిటీ చైర్మన్ నడికుడి వెంకటేశ్వరావు అన్నారు. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించిన నవ్యంధ్ర ప్రదేశ్ కుమ్మర శాలివాహన యువసేన మీడియా కమిటీ చైర్మన్ నడికుడి వెంకటేశ్వరావు తెలిపారు. ఆయన మాట్లాడుతు హైదరాబాదులోని మహాటీవీ న్యూస్ ప్రధాన కార్యాలయం పై నిన్న జరిగిన దాడిని నడికుడి వెంకటేశ్వరావు ఖండిస్తున్నమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగవ స్తంభంగా ఉన్న మీడియా పట్ల అమానుషంగా వ్యవహరించడం సరైంది కాదని నడికుడి వెంకటేశ్వరావుఆరోపించారు.న్యూస్ ప్రసారాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని ఖండించటం గాని లేదా చట్టపరంగా ముందుకు వెళ్ళటం గాని చేయాలే తప్ప మీడియా కార్యాలయాలపై దాడులకు దిగటం ప్రజాస్వామ్య వ్యవస్థలో సరైన చర్య కాదని.ఈ దాడులకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణా ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు.






## క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చు




ప్రముఖ వైద్యులు కందుల రాము

**వినుకొండ మేజర్ న్యూస్ :** ప్రతి సంవత్సరం సుమరు 15 లక్షల మంది క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ సీనియర్ క్యాన్సర్ వైద్యనిపుణులు రామ్ కందుల అన్నారు., వినుకొండ పట్టణంలోని రిలయన్స్ మార్ట్ పైన గల అతిథి గృహం నందు , గ్రామీణ వైద్యులకు ఏర్పాటుచేసిన క్యాన్సర్ పై అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పొగకు, మద్యం, జంక్ ఫుడ్స్, శరీర శ్రమ లేకపోవటం, ఉబకాయం దీనికి ముఖ్య కరణలుగా ఆయన తెలిపారు . నోటిలో మానని పుండ్లు, గొంతు బొంగురు పోవడం, దీర్ఘకాలముగ తగ్గని దగ్గు, ఆహారం తినడములో ఇంబ్బంది, రొమ్ములో గాని, శరీరంలో ఎక్కడైనా గడ్డలు రావటం, మలమూత్రదుల అలవాట్లలో మార్పులు, ఆసాధారణ మైన రక్తస్రావం కలగడం వంటివి వాటిగా ఆయన తెలిపారు. క్యాన్సర్‌కి సంబధించిన స్క్రీనింగ్ ప్రోగ్రామ్ గురించి వివరించినఆయన, క్యాన్సర్ వ్యాధి పట్ల భయపడాల్సిన అవసరం లేదని, ముందుగ గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చని వివరించారు. కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్, గుంటూరు నందు 200 పడకల తో,అధునాతన పరికరాలతో, సువిశాల ప్రాంగణములో, నెలకొల్పామని ఆయన సూచించారు. కార్యక్రమంలో వినుకొండ, ఎర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గం లోని పలు గ్రామాల నుండి గ్రామీణ వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## అమరావతి రథయాత్రలో పాల్గొన్న గోనుగుంట్ల లీలావతి

**గుంటూరు మేజర్ న్యూస్ :** విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో అమరావతి రథయాత్ర మహోత్సవ కార్యక్రమం ఆదివారం భవానిపురం సీతానగరంలో అంగరంగ వైభవంగా జరిగింది. జగన్నాథ రథయాత్ర భక్తి పారవశంతో సాగగా ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి పాల్గొన్నారు. రథయాత్రకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా సితార నగరం కూడలి నుంచి సీతమ్మ వారి పాదాల సెంటర్ వరకు మహిళా భక్తులతో యాత్రలో పాల్గొని కొలువుతీరిన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవత మూర్తులకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. వేడుకలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## లోకేష్... అచ్చంనాయుడు మధ్య ఆసక్తికర చర్చ

### మంగళగిరి పార్టీ కార్యాలయంలో మాటా మంతీ

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఏడాది పాలనపై పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ తో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న వీరు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకున్నారు. ఆనంతరం పార్టీ ఏడాది పాలనపై ఇరువురి మధ్య ఆసక్తికర సంభాషన కొనసాగింది. జిల్లా స్థితిగతులపై ఈ సందర్భంగా చర్చించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఊహించని విజయం వెనుక కార్యకర్తల కష్టం ఎంతో ఉందని చర్చించుకున్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ (కబ్) వ్యవస్థ వల్లే పార్టీ క్షేత్రస్థాయిలో బలపడిందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి అచ్చెన్నకు సూచించారు మంత్రి లోకేష్ . పార్టీకి నాలుగు దశాబ్దాలుగా సీనియర్లు అండగా నిలిచారని, సీనియర్ల అనుభవాన్ని, యువత శక్తిని జోడించి పార్టీని ముందుకు నడపాల్సిన అవసరం ఉందని అన్నారు. బాగా పనిచేసిన కార్యకర్తలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించి, సత్కరించాలని తెలిపారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని ఇరువురు మంత్రులు మాట్లాడుకున్నారు .



18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.
ఇట్లు... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జ్, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777